సాక్షి అనకాపల్లి

సోమవారం । 14 । ఆగస్టు । 2023



వల నిండింది.. పంట పండింది

తాండవ జలాశయంలో స్థానిక జాలర్లకు భారీగా రొయ్యలు, చేపలు దొరికాయి. ఇవి హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. 8లో



మారుతీనగర్‌లో చోరీ

చోడవరం సమీపంలోని గాంధీగ్రామం పంచాయతీ మారుతీనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. 8లో



పంద్రాగస్టుకు ఏర్పాట్లు

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ క్రీడామైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

డీఆర్‌వోగా అనిత

నేటి నుంచి పూర్తిస్థాయిలో బాధ్యతల నిర్వహణ



అనిత

సాక్షి, అనకాపల్లి: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా అనిత నియమితులయ్యారు. ఇప్పటి వరకు డీఆర్‌వోగా పనిచేసిన వెంకట రమణ దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె సోమవారం నుంచి పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహించనున్నారు. శుక్రవారం డీఆర్‌వో వెంకట రమణ సెలవు పెట్టడంతో..ఓటరు సర్వే ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను ఇన్‌చార్జి డీఆర్‌వోగా ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనితకు అప్పగించారు. శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఆమె సోమవారం నుంచి పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

రావణాపల్లి జలాశయం నీరు విడుదల



జలాశయం నుంచి సాగునీరు విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు

గొలుగొండ: మండలంలోని రావణాపల్లి జలాశయం నుంచి ఆదివారం సాగునీరు విడుదల చేశారు. వారం రోజుల నుంచి వర్షాలు కురకపోవడంతో రైతుల ఇబ్బందులు చూసి సాగునీటిని విడుదల చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో గొలుగొండ, నర్సీపట్నం మండలాల పరిధిలో సుమారు 2,400 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో ఆదివారం నీటిని విడుదల చేశారు. మరో నెల రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ రవికుమార్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, కొమిరి సర్పంచ్ అల్లు రాజుబాబు, చోద్యం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కె.పెద్దిరాజు తదితర్లు పాల్గొన్నారు.

నేడు కల్యాణపులోవ నీరు విడుదల



రిజర్వాయర్‌లో ఉన్న నీరు

రావికమతం: కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని ఆయకట్టు రైతుల కోరిక మేరకు సోమవారం ఉదయం విడుదల చేయనున్నారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 460 అడుగుల సామర్థ్యం గల కల్యాణపులోవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 452 అడుగుల నీరుందని ఇరిగేషన్ కొత్తకోట సెక్షన్ ఏఈ సత్యనారాయణ దొర ఆదివారం తెలిపారు. ఆయకట్టుకు ప్రధాన కాలువ ద్వారా రోజుకు 30 క్యూసెక్కుల చొప్పున 50 రోజుల పాటు విడుదల చేయాలన్నారు. ఇందుకు ప్రస్తుతం ఉన్న నీరు సరిపోతుందని చెప్పారు. ఎండలు విపరీతంగా కాస్తుండటం, నారు మడులు ఎండిపోతున్న దృష్ట్యా రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

నేటితో ముగియనున్న పాలిటెక్ ఆప్షన్ల గడువు

మురళీనగర్(విశాఖ): పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగియనుంది. దీంతో విద్యార్థులు ఆప్షన్ల ఎంపికతోపాటు వెబ్‌సైట్‌లో ఏర్పడుతున్న పలు సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గత మూడు రోజులుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో అధికారులను సంప్రదించి లాగిన్, పాస్‌వర్డ్ క్రియేషన్ వంటి సమస్యలను పరిష్కరించుకున్నారు. ఆదివారం కూడా వీరు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వచ్చి స్థానిక సిబ్బంది సహకారంతో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆప్షన్ల ఎంపిక సోమవారంతో ముగియనుండగా 16న ఆప్షన్లు మార్పిడి చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఈనెల 18న సీట్లు కేటాయిస్తారు. ఈనెల 19 నుంచి 23 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం ఉంది.

గోవాడ సుగర్స్‌ను ఆదుకుంటాం

- జగనన్న ప్రజాదీవెన సభలో రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ప్రజల కోసమే పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం : డిప్యూటీ సీఎం బూడి, మంత్రి అమర్‌నాథ్
- చోడవరం బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చిన జనం
- వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నూతనోత్తేజాన్ని నింపిన బహిరంగ సభ



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి



బహిరంగ సభకు తరలివచ్చిన వేలాది మంది ప్రజలు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుని జిల్లాలో చెరకు రైతులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి తెలిపారు. చోడవరం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా 'జగనన్న ప్రజా దీవెన' భారీ బహిరంగ సభను స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఒక పక్క స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు, మరో పక్క వాహనాలపై సభకు వచ్చిన జనంతో చోడవరం పట్టణంలో జాతర వాతావరణం నెలకొంది. తీన్‌మార్ డప్పుల మోతలు, కార్యకర్తల డ్యాన్స్‌లు, జై జగన్ నినాదాలతో పట్టణంలో రోడ్లు, సభా ప్రాంగణం హోరెత్తిపోయాయి. ముఖ్య అతిథిగా హాజరైన వై.వి.సుబ్బారెడ్డితోపాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బి.వి.సత్యవతికి నాయకులు ఘనస్వాగతం పలికారు. చోడవరం మెయిన్‌రోడ్డుపై సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున మేళతాళాలు, తీన్‌మార్ డ్యాన్స్‌లతో ఊరేగింపుగా సభావేదిక వద్దకు తీసుకొచ్చారు.

వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులంతా నివాళులర్పించారు. అనంతరం వేదికపై వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలకు, రైతులకు జీవనాధారంగా ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుని, అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీని రూ.150 కోట్ల అప్పుల్లోకి నెట్టేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.110 కోట్ల అప్పులు తీర్చామని తెలిపారు. మిగతా రూ.40 కోట్లు నాలుగు నెలల్లో ప్రభుత్వ సహకారంతో తీర్చేసి రైతులకు మేలు చేస్తామని సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం చేసి, కాలువల ద్వారా 1.40 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనకాపల్లి నుంచి చోడవరం మీదుగా నర్సీపట్నం వెళ్లే ఆర్‌అండ్‌బీ, బీఎన్‌రోడ్డు విస్తరణకు ఏడాది కిందటే ప్రభుత్వం రూ.112 కోట్లు మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణపనుల్లో జాప్యం జరిగిందని చెప్పారు. రోడ్డు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో ప్రారంభించి మూడు నెలల్లో పనులు పూర్తి చేయకపోతే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్ద పీట వేస్తుందని సుబ్బారెడ్డి చెప్పారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావులేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు ప్రజలకు నేరుగా అందించేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జల్ జీవన్ మిషన్‌లో రూ.150 కోట్లతో చోడవరం నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిలు వేసినట్టు చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీటవేస్తోందని తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో రైతులను, మహిళలను చంద్రబాబునాయుడు మోసం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు.

తాటాకు చప్పుళ్లకు జగన్ భయపడరు

మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ కేంద్రంతో ఏదో చెప్పేస్తామంటూ పవన్‌కల్యాణ్ చేస్తున్న తాటాకు చప్పుళ్ల బెదిరింపులకు జగన్‌మోహన్‌రెడ్డి భయపడరన్నారు. 35 ఏళ్ల వయస్సులోనే సోనియా గాంధీని ఎదిరించిన జగన్‌ను చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ ఏమీ చేయలేరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగైపోతాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. ఇంటింటికీ ఎమ్మెల్యేలను పంపి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని చెప్పిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అమర్‌నాథ్ చెప్పారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి

అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బీవీ సత్యవతి మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ నెరవేర్చడంతోపాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపనులు, సమస్యలపై ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సభలో సుబ్బారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధర్మశ్రీ కోరారు. గడప గడపకు మన ప్రభుత్వంలో 160 గ్రామాల్లో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భారీగా జరిగిన బహిరంగ సభ వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నూతనోత్తేజాన్ని నింపింది.



ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న పార్టీ కార్యకర్తలు

జగన్‌ను అడ్డుకునే శక్తి వారికి లేదు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకునే శక్తి చంద్రబాబుకు, ఆయన దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్‌కు లేదని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. కేంద్రంలో సోనియాగాంధీని, కాంగ్రెస్ పార్టీని ఎదిరించిన మొనగాడు సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. పార్టీలకతీతంగా .. అవినీతికి తావు లేకుండా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని చెప్పారు. వచ్చే జనవరి నుంచి పింఛన్ రూ.3 వేల ఇవ్వనున్నట్టు తెలిపారు. టీడీపీ హయాంలో జన్మ భూమి కమిటీల ద్వారా దోచుకుతిన్నారన్నారు. దత్త పుత్రుడు పవన్, చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ఆరు నెలలు ముందు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. ఎన్ని యాత్రలు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

దివ్యాంగులకు వాహన యోగం

- జిల్లాలో 129 మంది అర్హులు
- తొలి విడతలో నియోజకవర్గానికి 10 మందికి చొప్పున పంపిణీ

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పథకాలు అమలవుతున్నాయి. ఆపన్నులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు వాహనయోగం కల్పిస్తోంది. పూర్తి సబ్సిడీపై వాహనాలు అందిస్తూ వారికి అండగా నిలుస్తోంది. రెండు చేతులు ఉండి, స్వయంగా వాహనం నడపగల దివ్యాంగులకు ప్రభుత్వం స్కూటీలను అందజేస్తోంది. దీనికి గానూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. రూ.లక్ష పైబడి విలువ ఉన్న స్కూటీలను శతశాతం సబ్సిడీపై ఉచితంగా ఇస్తోంది. పదవ తరగతి చదివి, త్రిచక్ర వాహనం నడపగలిగిన కలిగిన వారికి మంజూరు చేస్తున్నారు. దీంతో దివ్యాంగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే వికలాంగ పింఛన్లు, రుణాలు అందిస్తున్న ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటోంది.



వికలాంగులకు అందజేస్తున్న స్కూటీ

జిల్లాలో 129 మంది అర్హులు

జిల్లాలో మొత్తం 23 వేల మంది దివ్యాంగులున్నారు. వీరిలో ఏడు వేల మంది శారీరక వైకల్యం కలిగిన వారు. వీరిలో స్కూటీల కోసం ఆన్‌లైన్లో సుమారు 200 మంది దరఖాస్తు చేసుకోగా 129 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. మొదటి విడతలో 70 మందికి వాహనాలను అందిస్తున్నారు. నియోజకవర్గానికి పది చొప్పున తొలివిడత అందిస్తున్నారు.

చాలా మంచి కార్యక్రమం

ఇది చాలా మంచి కార్యక్రమం. శారీరక వైకల్యం కలిగిన పదవ తరగతి పాసైన వారికి స్వయం ఉపాధి పనులకు ఇది దోహదపడుతుంది. యలమంచిలి నియోజకవర్గంలో 13 మందికి ఈ వాహనాలు అందిస్తున్నాం.

–ఉప్పలపాటి రమణమూర్తి రాజు, ఎమ్మెల్యే, యలమంచిలి

దివ్యాంగులకు అండగా నిలవాలనే..

దివ్యాంగులకు అండగా నిలిచి, ప్రయాణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం వాహనాలు మంజూరు చేస్తోంది. శత శాతం సబ్సిడీతో లబ్ధిదారునికి అందిస్తున్నాం. జిల్లాలో 129 మంది అర్హులు ఉన్నారు. తొలివిడతలో నియోజకవర్గానికి పది చొప్పున అందిస్తున్నాం.

–జగదీష్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ

హ్యాపీ బర్త్‌డే పీచెస్

- జూలో ఘనంగా ఆడ తెల్లపులి పుట్టిన రోజు వేడుక
- నెల రోజుల పాటు దత్తత తీసుకున్న సీపీఈ యాజమాన్యం



విద్యార్థులతో కలసి కేక్ కట్ చేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా



తెల్లపులి పీచెస్

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులోని పీచెస్ అనే ఆడ తెల్ల పులి పుట్టిన రోజు ఘనంగా జరిగింది. తెల్ల పులుల ఎన్‌క్లోజర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీపీఈ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు పులి మాస్కులు ధరించి సందడి చేశారు. విద్యార్థులతో కలిసి క్యూరేటర్ నందనీ సలారియా కేకు కట్ చేసి సందర్శకులకు పంచిపెట్టారు. సీపీఈ కళాశాల యాజమాన్యం ఆ పులిని నెల రోజుల పాటు దత్తత తీసుకుంది. పీచెస్ పుట్టి ఐదేళ్లు పూర్తయిందని, ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పుట్టిన రోజు వేడుక నిర్వహించామని క్యూరేటర్ తెలిపారు. నెల రోజుల పాటు పీచెస్‌కు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన సీపీఈ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన సైనికుల కుమ్ములాట

- ఫ్లెక్సీల విషయంలో రెండు వర్గాల మధ్య తోపులాట
- విజయకుమార్ కటౌట్లను తీయించి వేసిన పరుచూరి భాస్కరరావు వర్గీయులు



ఇరు వర్గీయుల మధ్య తోపులాట..



కటౌట్లను చించేసి తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, అనకాపల్లి: కటౌట్ల విషయంలో జనసైనికులు ఆదివారం కుమ్ములాడుకున్నారు. అనకాపల్లి జనసేన ఇన్‌చార్జి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు, యలమంచిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్‌ల మధ్య విభేదాలు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో మరోసారి బయటపడ్డాయి. అధినేత వద్ద ఎక్కువ మార్కులు కొట్టేద్దామనే పనిలో ఇద్దరూ ఉండడం.. ఇద్దరూ పవన్‌కు సన్నిహితంగా ఉండడంతో వారి మధ్య ఆధిపత్యపోరు జరుగుతోంది. అనకాపల్లి పూడిమడక రోడ్డులో జాతీయ రహదారికి అనుకుని ఉన్న భాస్కరరావు కార్యాలయం సమీపంలో సుందరపు విజయకుమార్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో మా ప్రాంతంలో మా అనుమతి లేకుండా కటౌట్లు ఎలా పెడతారని తమ వర్గీయులతో పరుచూరి భాస్కరరావు వాటిని చింపివేయించారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్ వర్గీయులు, భాస్కరరావు వర్గీయుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. సుమారు గంట పాటు వీరు గొడవపడ్డారు. చివరికి విజయకుమార్ కటౌట్లను పూర్తిగా చించి, తీసివేశారు. అసలే జనసేన పార్టీ పరిస్థితి బాగోలేదు. ఈసారి కూడా చంద్రబాబుకు తన అధినేత కొమ్ముకాయడం నచ్చని జనసైనికులు ఇప్పటివరకూ అంటీముట్టనట్లుగా ఉంటున్నారు.

గ్రామాల్లో రోజు రోజుకూ జనసేన గ్రాఫ్ అత్యంత కింది స్థాయికి పడిపోతుండడంతో పవన్ అభిమానుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. వారాహి యాత్రలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలంలో విసన్నపేటలో భూములు పరిశీలించడానికి సోమవారం పవన్‌కల్యాణ్ రానున్నారు. ఈ నేపథ్యంలో కటౌట్ల కోసం కార్యకర్తల మధ్య విభేదాలు చోటు చేసుకోవడం.. అవి కాస్త సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో కేడర్ మరింత నిరుత్సాహానికి గురైంది.

మన ఆంధ్ర.. ఏపీఎల్

బీచ్‌రోడ్డులో ఉత్సాహంగా 3కే రన్





3కే రన్ ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి, ఏసీఏ కోశాధికారి ఎ.వి.చలం, సీఈవో ఎం.వి.శివారెడ్డి, విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లో మన ఆంధ్ర.. మన ఏపీఎల్ పేరిట ఆదివారం చేపట్టిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున క్రీడాజ్యోతిని వై.వి.సుబ్బారెడ్డికి అందించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డికి క్రీడాజ్యోతిని అందజేశారు. సాగరతీరంలోని వైఎస్సార్ విగ్రహం చెంతకు చేరడంతో ఈ రన్ ముగిసింది. ముఖ్య అతిథులు రన్ చేసి యువ క్రికెటర్లలో క్రీడా స్ఫూర్తిని నింపారు.

ఈ నెల 16వ తేదీ నుంచి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ప్రారంభం కానున్న ఏపీఎల్‌లో ఆరు జట్లు 19 మ్యాచ్‌లు ఆడనున్నాయి. 27న జరిగే టైటిల్ పోరుతో ఏపీఎల్ ముగియనుంది. ఆంధ్రా క్రికెటర్ల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఏసీఏ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ కోశాధికారి ఎ.వి.చలం, సీఈవో ఎం.వి.శివారెడ్డి, విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, విశాఖ నుంచి తొలి అంతర్జాతీయ క్రీడాకారిణి స్నేహ దీప్తి, అండర్–19 వరల్డ్ కప్‌లో సత్తాచాటిన శశికాంత్, వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, కోస్టల్ రైడర్స్, రాయలసీమ కింగ్స్, బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ జట్ల ఆటగాళ్ల, యజమానులు, ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు.



పరుగులో పాల్గొన్న క్రీడాభిమానులు

క్లుప్తంగా

లారీ అసోసియేషన్ల రగడ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల కేంద్రంలో లారీ అసోసియేషన్ ఎన్నికకు సంబంధించి వివాదం నడుస్తోంది. వారం క్రితం అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఒక కమిటీ ప్రకటించింది. ఆదివారం మరొక నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మళ్లీ ప్రకటన విడుదలయింది. దీంతో వారం క్రితం ఎన్నికైన కమిటీ సభ్యులు సమావేశమై తాజాగా ఎన్నికైన కమిటీ చెల్లదని పేర్కొన్నారు. తమ వద్ద 50 మంది సభ్యులుండగా, కేవలం ఐదుగురున్న వర్గం కొత్తగా కమిటీ వేస్తున్నట్లు ప్రకటించడం సరికాదని గత వారం ప్రకటించిన కమిటీ అధ్యక్షుడు కొమ్మోజు ఈశ్వరరావు విమర్శించారు. దీన్ని పెద్దల దృష్టికి తీసుకెళతామన్నారు. భిన్న ప్రకటనలు, భిన్న కమిటీలతో కాస్త గందరగోళం ఏర్పడింది. ఈ సమస్య త్వరలోనే పరిష్కారం కావాలని లారీ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు.

ఉత్కంఠగా టెన్నిస్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్థాయి జూనియర్ టెన్నిస్ టోర్నీలో హాసిన, శౌర్య విజేతలుగా నిలిచారు. విశాఖలోని సింథటిక్ టెన్నిస్ కోర్టులో ఆదివారం ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. అండర్-10 నుంచి 16 వరకు నాలుగు ఏజ్ కేటగిరిల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. బాలుర అండర్-16 ఫైనల్స్‌లో కె.శౌర్య 9-6తో వై.ఆర్నవ్‌పై గెలుపొందాడు. బాలికల అండర్-14లో ఆర్.హాసిన 9-7తో ఎ.ఆరుషీపై గెలుపొందింది. అండర్-16 ఫైనల్‌లో మోక్షధనుంజయ్ 9-0తో ఆరుషీపై గెలవగా, అండర్-10 బాలుర ఫైనల్స్‌లో రేవంత్‌రిషీ 9-2తో బి.దాత్రేష్‌పై విజయం సాధించాడు. బాలికల అండర్-12 ఫైనల్స్‌లో పి.సేవిత9-4తో అలీషాపై విజయం సాధించింది. బాలికల అండర్-10 ఫైనల్స్‌లో జి.రిషికమధో 9-5తో సుధీక్షణపై విజయం సాధించింది.

వల నిండింది.. పంట పండింది

- భారీగా దొరుకుతున్న రొయ్యలు, చేపలు
- తాండవ నీటి విడుదలే కారణమంటున్న జాలర్లు



జాలర్ల వలకు చిక్కిన 18 కిలోల చేప



జలాశయంలో మత్స్య వేటలో జాలర్లు

గొలుగొండ: ఆదివారం వస్తే చాలు.. మాంసాహార ప్రియులకు పండగే. అందులోనూ తాండవ చేపలు, రొయ్యలంటే మరింత ఇష్టం. సుమారు 2,400 ఎకరాల్లో విస్తరించి ఉన్న తాండవ జలాశయంలో సహజంగా దొరికే నాచు, గడ్డి తిని పెరిగే రొయ్యలు, చేపలకు కాస్త రుచి ఎక్కువని స్థానికులు చెప్తుంటారు. స్థానిక జాలర్లకు ఆదివారం భారీగా రొయ్యలు, చేపలు దొరికాయి. వీటికి గొలుగొండ, జోగుంపేట సంతలో మంచి డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌కు చేరిన తాండవ జలాశయ చేపలు, రొయ్యలు వచ్చినవి వచ్చినట్లే అమ్ముడుపోయాయి.

నాలుగు రోజులు నుంచి వేట అదుర్స్

ప్రస్తుతం తాండవ జలాశయం నుంచి సాగునీటిని విడిచిపెట్టారు. గత నాలుగైదు రోజులుగా వర్షాల్లేక, ఎండలు కూడా బాగా ఉండటంతో జాలర్లకు చేపలు, రొయ్యల పంట పండింది. నాలుగు రోజుల నుంచి జలాశయంలో చేపలు, రొయ్యల వేట జోరుగా సాగుతోంది. జలాశయానికి గొలుగొండ మండలంలోని బొడ్డేరు, దారగెడ్డలు ప్రధాన ఆధారం. వారం పది రోజుల నుంచి వర్షాల్లేక ఈ గెడ్డల నుంచి చుక్క నీరు రావట్లేదు. దీనికి తోడు పంట భూములకు నీరు వదలడంతో నీటి మట్టం కదలికలు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వల్ల అడుగున ఉన్న చేపలు బయటకు వచ్చి, జాలర్ల వలకు చిక్కుతున్నాయి. ఏటా ఫిబ్రవరి రెండోవారం నుంచి జూలై వరకు మాత్రమే రొయ్యల వేట సాగుతుంది. ఆగస్టులో భారీ వర్షాలు ఉండటం వలన రొయ్యల వేట నిలిపేసేవారు. నీరు పెరిగినపుడు రొయ్యలు వలకు చిక్కడం చాలా తక్కువ. నీటి మట్టం తగ్గడంతో చేపలతో పాటు రొయ్యలు అధికంగా పడుతున్నాయి.

2 నుంచి 18 కిలోల బరువు

తాండవ జలాశయంలో ప్రస్తుతం రెండు కిలోల నుండి 18 కిలోల బరువున్న చేపలు పడుతున్నాయి. ఈ జలాశయంపై ఆధారపడి గొలుగొండ మండలంలో పొగచెట్లపాలెం, వెంకటాపురం, సాలికమల్లవరం, జోగుంపేట, గొలుగొండ, అమ్మపేట, జాలారు, విప్పలపాలెం, గాదంపాలెంతో పాటు నాతవరం మండలంలో మరో నాలుగు గ్రామాల జాలర్లు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నీటిని దిగువకు విడిచిపెట్టడంతో వందలాది మంది జాలర్లు జాలాశయంలో వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం చేపల వేటతోపాటు రొయ్యలు కూడా జాలర్లకు అధికంగా దొరుకుతున్నాయి. రొయ్యలు ఇక్కడి మార్కెట్లో కిలో రూ.250, చేపలు కిలో రూ.150 చొప్పున అమ్మకాలు జరుగుతున్నాయి.



అధికంగా పడిన రొయ్యలు

లాభాల వేట



నాలుగు రోజుల నుంచి వేట జోరుగా సాగుతోంది. ప్రస్తుతం తాండవ జలాశయంలో రొయ్యలు, చేపలు అధికంగా వలలకు చిక్కుతున్నాయి. వాటిని పట్టుకునేందుకు పోటీ పడుతున్నాం. మార్కెట్లో తాండవ చేపలు, రొయ్యలకున్న డిమాండ్ కూడా కాస్త కలిసొస్తోంది.

–దేముడు, జాలరి, వెంకటాపురం

మారుతీనగర్‌లో చోరీ

3 తులాల బంగారు నగలు, రూ.1.10 లక్షల నగదు అపహరణ



దొంగలు తెరచిన ఇనుప బీరువా

చోడవరం రూరల్: పట్టణం సమీపంలోని గాంధీ గ్రామం పంచాయతీ మారుతీనగర్‌లోని బాలికల వసతిగృహం నైట్ వాచ్‌ఉమెన్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో మూడు తులాల బంగారు నగలు, రూ.1.10లక్షల నగదును దొంగలు అపహరించుకు పోయారు. బాధితురాలు గొల్లమాలి దేవి కథనం ప్రకారం బాలికల హాస్టల్‌లో వాచ్‌ఉమెన్‌గా చేస్తున్న ఆమె తన కుమారుడు నానాజీతో కలిసి మారుతీనగర్‌లో బి.ఎన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. శనివారం రాత్రి ఆమె హాస్టల్లో విధులకు వెళ్లగా తన కుమారుడు ఉక్కపోత కారణంగా ఇంటి తలుపు గడియపెట్టి, మేడపైకి వెళ్లి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం లేచి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇనుప బీరువా తెరచి ఉండి అందులోని బట్టలు చిందర వందరగా, మంచంపైనా పడవేసి ఉన్నాయి. ఇది చూసిన నానాజీ తన తల్లి దేవికి సమాచారం అందించాడు. ఆమె వచ్చి చూసుకునే సరికి బీరువాలో దాచుకున్న బంగారు వస్తువులు, నగదు దొంగలపాలైనట్టు గుర్తించి చోడవరం పోలీసులను ఆశ్రయించింది. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీంను రప్పించి సాక్ష్యాధారాల సేకరణ జరిపారు.

ఇంటింటికీ కుళాయిలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సంపతిపురం ఎస్సీ కాలనీలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నీటి సరఫరా చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి మండలంలోని సంపతిపురం ఎస్సీ కాలనీలో రూ.24 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు,ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలను, ఇక్కడ శ్మశాన వాటిక వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చేతి బోరును మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10.30 లక్షలతో ట్యాంకు, మరో రూ.14 లక్షలతో 120 ఇళ్లకు కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లుగా తమ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టనన్ని పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్,వైఎస్సార్ సీపీ నేతలు గొల్లవిల్లి శ్రీను,పల్లా శ్రీనివాసరావు,నంబారు రమణ, ఒమ్మి రమణ,ఉప్పులూరి నాగేశ్వరరావు,దాకారపు గోవింద్,పి.గోవింద్, ప్రసాద్,ఎంపీడీవో కేవీ నరసింహారావు,ఈవోపీఆర్డీ కె.ధర్మారావు,గ్రామీణ నీటి సరఫరా ప్రాజెక్ట్స్ విభాగం డీఈఈ భారతి,ఏఈఈ సాద్విక్,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు శ్రీనివాస్, కుమారరాజు, డీఆర్‌డీఏ ఏపీఎం కె. నీలాచలం,వివిధ శాఖల అధికారులు,స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8309561123, 7036363272 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మత్తులో యువకుల హల్‌చల్

- ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న జులాయిలు
- హడలెత్తిపోతున్న దేవరాపల్లి ప్రజానీకం
- ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు
- నలుగురిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్ఐ నాగేంద్ర వెల్లడి



రాత్రి పది గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దేవరాపల్లి గ్రామ ప్రజలు

దేవరాపల్లి: కొందరు యువకులు మత్తు పానియాలకు బానిసై ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ ఆ మత్తులో రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామంలో హల్‌చల్ చేస్తూ దాడులకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే చంపేస్తామంటూ బెదిరిస్తూ జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి పూట ఇంటి నుండి బయటకు రావాలంటే మహిళలు హడలెత్తిపోతున్నారు. ఇటీవల దేవరాపల్లి-వాలాబు రహదారిలో కొబ్బరి తోట వద్ద అటుగా వెళ్తున్న ఆటోను అడ్డగించి ఆటోలో ఉన్న వ్యక్తులపై దాడికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. ముఠాగా ఏర్పడిన జులాయిలు సమీపంలోని పలు షాపుల యజమానులపై సైతం దాడికి తెగబడినట్టు చెబుతున్నారు. వీరి దౌర్జన్యాలకు భయపడి ఫిర్యాదు చేసేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. అయితే వీరి ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరడంతో విసిగివేసారిన జనం శనివారం రాత్రి తిరగబడ్డారు. సుమారు 200 మందికి పైగా జనం రోడ్లపైకి వచ్చి మత్తులో ఉన్న జులాయిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వీరి నుండి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ శనివారం రాత్రి మహిళలు సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీరి దుశ్చర్యలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజలంతా మూకుమ్మడిగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర వద్ద ప్రస్తావించగా స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు నలుగురు యువకులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు



సిద్ధమవుతున్న వేదిక



క్రీడామైదానంలో మాక్‌డ్రిల్ చేస్తున్న పోలీసులు

అనకాపల్లిటౌన్: స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ క్రీడామైదానాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ ప్రభుత్వశాఖల స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చే అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు కూర్చుని స్వాతంత్య్ర వేడుకలను తిలకించేందుకు వీలుగా క్రీడామైదానంలో ఆరు గ్యాలరీలను సిద్ధం చేస్తున్నా రు. ఏఆర్ డీఎస్పీ ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం మాక్ డ్రిల్ నిర్వహించారు.

కేజీహెచ్.. న్యూ లుక్



నూతనంగా నిర్మించిన ప్రధాన ద్వారం



రెండో క్యాజువాల్టీలో పడకలు

- సకల సదుపాయాలతో సిద్ధమైన రెండో క్యాజువాల్టీ
- ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ప్రధాన ద్వారం
- నేడు మంత్రి విడదల రజిని చేతుల మీదుగా ప్రారంభం

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో తీర్చిదిద్దిన రెండో క్యాజువాల్టీ, ప్రధాన ద్వారం ప్రారంభోత్సవం సోమవారం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని వీటిని ప్రారంభిస్తారు. కేజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయి. దానికి తగ్గట్టుగానే ఆస్పత్రిలో పలు విభాగాలు తీర్చిదిద్దారు. ఇప్పుడు రెండో క్యాజువాల్టీని కూడా కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నే విధంగా తయారు చేశారు. ఇందుకు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. లేబొరేటరీ, మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్, ఎయిర్‌కండిషన్, 20 ఆధునాతన పడకలు సిద్ధం చేశారు. అలాగే కేజీహెచ్‌లో రూ.30 లక్షలతో ప్రధాన ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చొరవ తీసుకొని వీఎంఆర్‌డీఏ నిధులతో ఈ ముఖ ద్వారం అందుబాటులోకి తీసుకొచ్చారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో మునగపాక యువకుడికి అవార్డు



నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో మెరిట్ అవార్డు అందుకుంటున్న మునగపాక వాసి లక్ష్మీ గణేష్

మునగపాక: మండల కేంద్రం మునగపాకకు చెందిన పెయింటర్ కణితి లక్ష్మీ గణేష్ నేషనల్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో మెరిట్ అవార్డును దక్కించుకున్నాడు. తమిళనాడులోని డాక్టర్ జయలలిత మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొన్నాడు. శ్రీ దర్శిని కలాయ్ కూడమ్ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో మెరిట్ అవార్డు అందుకున్నాడు.

బిల్డింగ్ పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి



మృతుడు పాకిరి నాయుడు

కూర్మన్నపాలెం : నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కింతలవానిపేట గ్రామానికి చెందిన పాకిరి నాయుడు(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య రమణమ్మ, కూతురు సీతామహాలక్ష్మి, అల్లుడు ఉమాశంకర్‌తో కలిసి కూర్మన్నపాలెంలోని కాశీపాలెంలో నివాసముంటున్నాడు. ఆదివారం కూర్మన్నపాలెం పరిధి వుడా ఫేస్-7 ద్వారకాపురి కాలనీలో గల గ్లోరియా స్కూల్ పక్కన ఓ ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారు. లిఫ్ట్‌లో మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న క్రమంలో 3వ ఫ్లోర్ పై నుంచి జారి పడి అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి దానం.. మరొకరికి ప్రాణం

- 16 ఏళ్ల చిన్నారికి గుండె మార్పిడి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే..
- ఇందుకు రూ.కోటి ఖర్చు చేసిన ప్రభుత్వం
- అవయవదానంపై మరింత అవగాహన పెరగాలి
- కలెక్టర్ మల్లికార్జున
- అవయవదాతల కుటుంబ సభ్యులకు సత్కారం



అవయవ దానం చేసిన కుటుంబ సభ్యుల్ని సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



అవయవ దానం ప్రతిజ్ఞ బ్యానర్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్

బీచ్‌రోడ్డు: వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్ట్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న 16 ఏళ్ల చిన్నారికి జీవన్ దాన్ ద్వారా గుండె మార్పిడి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అవయవదానంపై మూడేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. మరింతగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5 లక్షల మందికి అవయవాలు వైఫల్యం చెందుతున్నాయని చెప్పారు. వారిలో కేవలం 10 శాతం మంది వైద్యం చేయించుకుని జీవించగలగుతున్నారని.. మిగిలిన వారు మరణిస్తున్నారని తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించాలంటే ప్రజలు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల్లో 50 శాతం రాయితీని ప్రకటించిన కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అవయవదానం ప్రతిజ్ఞ ఫ్లెక్సీపై సంతకం చేశారు.

తొలి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలను సేకరించిన రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్ అని జీవన్ దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు అన్నారు. ఇప్పటి వరకు విమ్స్‌లో ఇద్దరి వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించినట్లు వెల్లడించారు. అవయవదానంపై ప్రజల్లో చాలా సందేహాలు, అపోహలు ఉన్నాయని.. వాటిని విడిచి పెట్టాలని సూచించారు. అవయవాలు దానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేవలం మన రాష్ట్రంలోనే అవయవాల కోసం 3 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని, పేర్లు నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా అవయవదానం చేసిన 15 మంది కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ నాగేందర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, విమ్స్ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు, ఎన్జీవోలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీవన్ దాన్ వల్లే బతికి ఉన్నా..



నేను నాలుగేళ్లగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. కిడ్నీ మార్పిడికి నా తల్లిదండ్రుల మూత్రపిండాలు సరిపడలేదు. ఈ నాలుగేళ్లు నరకం చూశాను. ఈ రోజు నేను బతికి ఉన్నానంటే అది కేవలం జీవన్ దాన్ వలనే. జీవన్‌దాన్‌లో నాకు ఓ కిడ్నీ కేటాయించారు. జూన్ 26న కిడ్నీ మార్పిడి చేశారు. ఇప్పుడు చాలా సంతోషంగా జీవిస్తున్నాను. ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకొచ్చి నాలాంటి వారికి నూతన జీవితాన్ని ప్రసాదిస్తారని కోరుతున్నాను.

– రవితేజ, విజయనగరం

ఐదుగురికి 'సంతోష్'ం అందించాడు



వెంకట సంతోష్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అనుకోని ప్రమాదంలో సంతోష్ మాకు దూరం అయ్యాడు. కానీ మేము సంతోష్ అవయవాలను దానం చేసి మరో ఐదుగురి జీవితాల్లో సంతోషం నింపగలిగామన్న సంతృప్తి ఉంది. అవయవాలను మట్టిలో కలిసిపోయేలా చేసే కంటే.. వేరొకరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడాలి. ఈ రోజు చాలా మంది మా కుటుంబాన్ని అభినందిస్తున్నారు.

– వెంకట సంతోష్ కుటుంబ సభ్యులు, ఆరిలోవ

క్లుప్తంగా

వైద్యురాలు అపర్ణకు సత్కారం



డాక్టర్ అపర్ణను సత్కరిస్తున్న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్ : పక్షవాతం, నరాల బలహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేయనున్నట్లు వైద్యురాలు పి.హెచ్.ఎస్.అపర్ణ తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని తమ కార్యాలయం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అపర్ణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 300 మంది పేదలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోరుకొండ వీరభద్రరావు, జోనల్ ఉపాధ్యక్షుడు అలక రాజు, జోనల్ మీడియా కో ఆర్డినేటర్ వై.వి.రమణి, కోశాధికారి బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం జరగనుంది. దేవాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఉదయం 7 గంటలలోపు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9491000713 నంబరులో సంప్రదించాలన్నారు.

23న మరిడిమాంబ అమ్మవారి పండగ

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధిలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి కోరుకొండ రాఘవ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ రాఘవ మిత్రమండలి వారి ఆధ్వర్యంలో అదేరోజు సాయంత్రం 4 గంటలకు మెగా క్రికెట్ టోర్నమెంట్ రింగ్‌రోడ్డులో జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.10 వేలు, 5వేలు, షీల్డ్ అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000113455, 9032338806 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు విసన్నపేట గ్రామానికి పవన్ కల్యాణ్

కశింకోట : మండలంలోని విసన్నపేట గ్రామానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం ఉదయం 11 గంటలకు రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా అక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్న ఆరోపణల నేపథ్యంలో వాటిని పవన్ కల్యాణ పరిశీలిస్తారని తెలియజేశారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
భోళాశంకర్	:	సత్యనారాయణ స్క్రీన్-1
ఉస్తాద్	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
భోళాశంకర్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ'పాజిటివ్-2 యూనిట్లు, 'బి'పాజిటివ్-10 యూనిట్లు, 'ఒ'పాజిటివ్ 16 యూనిట్లు, 'ఏబీ' పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 262 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

రైళ్లు నడవవు.. బతుకులు సాగవు

- ఆగిపోయిన కశింకోట, బయ్యవరం, నరసింగబిల్లి సర్వీసులు
- పునరుద్ధరించాలని ప్రయాణికుల వినతి

భారతీయులకు సురక్షితంగా, చౌకగా ప్రయాణించే సాధనం రైలు. అందుకే ప్రజల్లో వాటికి గొప్ప పేరు ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల.. కొన్ని చోట్ల రైలు సర్వీసులు అర్ధంతరంగా ఆగిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కశింకోట, బయ్యవరం, నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల గుండా గతంలో అన్ని రైళ్లు ప్రయాణించేవి. ప్రజలు కావాల్సిన చోటుకు ప్రయాణించేవారు. అయితే గత కొంత కాలంగా ఆ స్టేషన్లలో ఆగే రైళ్లను రైల్వేశాఖ నడపకపోవటం వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆ రైళ్లను పునరుద్ధరించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిర్మానుష్యంగా కశింకోట రైల్వే స్టేషన్



సందడి లేని నరసింగబిల్లి రైల్వే స్టేషన్

కశింకోట : మండలంలోని మూడు రైల్వేస్టేషన్లు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. ఇక్కడ ఆగే రైళ్లు సుమారు మూడు నెలలుగా రైల్వే శాఖ నడపడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైళ్లు నడవక స్టేషన్లు వెలవెలబోతున్నాయి. మండలంలో కశింకోట, బయ్యవరం, నరసింగబిల్లి రైల్వే స్టేషన్లున్నాయి. ఇక్కడ కరోనాకు ముందు వరకు రాను పోను 8 పాసింజర్ రైళ్లు ఆగేవి. ప్రయాణికులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉండేది. కరోనా తర్వాత వాటిని రైల్వే శాఖ అకాణంగా రద్దు చేసింది. వాటి స్థానంలో గతంలో పాసింజర్లుగా నడిచే కాకినాడ-విశాఖ, రాజమండ్రి-విశాఖ రైళ్లను రానూ, పోనూ ఎక్స్‌ప్రెస్‌లుగా పునరుద్ధరించి నడుపుతున్నారు. టిక్కెట్ ధరను ఎక్స్‌ప్రెస్ ఛార్జీ స్థాయిలోనే వసూలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది ఉద్యోగులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు, సీజనల్ ప్రయాణికులు, సాధారణ ప్రయాణికులు, అటు విశాఖ, దువ్వాడ, ఇటు యలమంచిలి, తుని, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండేవారు. అయితే ఒడిశాలో కోరమండల్ రైలు ప్రమాదం జరిగిన తర్వాత సుమారు మూడు నెలలుగా ఈ రైళ్లు నడపకుండా నిలిపేశారు. వాటిని పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పటమే తప్ప కార్యరూపం దాల్చలేదు. ఇక్కడి మూడు స్టేషన్లలో ఆగే రైళ్లు నడపకపోవడంతో అటు అనకాపల్లి, ఇటు యలమంచిలి వంటి స్టేషన్లకు అధిక వ్యయ ప్రయాసలతో చేరుకుని ఇతర రైళ్లలో ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

మరికొందరు ఎక్కువ ఛార్జీ చెల్లించి బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని, ఇది భారంగా ఉందంటున్నారు. గతంలో కరోనాకు ముందు పాసింజర్‌గా నడిపిన ప్రస్తుత రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, విశాఖ-మచిలీపట్నం రైళ్లను కూడా ఇక్కడి స్టేషన్లలో నిలపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రైళ్ల రాకపోకలు పునరుద్ధరించాలి



నేను చిరుద్యోగిని. ప్రతి రోజూ విశాఖలో విధులకు రాకపోకలు సాగిస్తుంటాను. మూడు నెలలుగా కాకినాడ-విశాఖ-కాకినాడ, రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేశారు. దీనివల్ల ఎక్కువ ఛార్జీ చెల్లించి ఆటోలో అనకాపల్లి స్టేషన్‌కు చేరుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలి.

– రాయి శ్రీను, చిరుద్యోగి, కశింకోట.

రైళ్లు లేక ఇబ్బందిగా ఉంది..



నరసింగబిల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం విశాఖకు ప్రయాణిస్తుంటాను. విశాఖ-కాకినాడ, రాజమండ్రి-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపకపోవడం వల్ల పక్కనే స్టేషన్ ఉన్నప్పటికీ అటు దూరంగా ఉన్న యలమంచిలి, ఇటు అనకాపల్లి వంటి స్టేషన్లకు చేరుకోవడం ఇబ్బందిగా ఉంది.

– పూడి ప్రసాద్, చిరు వ్యాపారి, నరసింగబిల్లి, కశింకోట మండలం.

పైస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలి

విశాఖ-కాకినాడ, రాజమండ్రి-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణకు డీఆర్ఎం స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ రైళ్లను సుమారు మూడు నెలల క్రితం నిలిపి వేశారు. కారణం తెలియదు. రైళ్లు పునరుద్ధరిస్తే కశింకోట, నరసింగబిల్లి స్టేషన్లలో యథావిధిగా ఆగుతాయి.

– బి.వెంకటేశ్వరరావు, అనకాపల్లి స్టేషన్ మేనేజర్, అనకాపల్లి.

వూషూ క్రీడాకారులకు బాక్సింగ్ కిట్ల పంపిణీ

తుమ్మపాల : మండలంలో అక్కిరెడ్డిపాలెంలో గల వూషూ క్రీడాకారులకు పీఏసీఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్ బాక్సింగ్ కిట్లు అందించారు. అరుణ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిక్షణలో సమీప గ్రామల చిన్నారులు వూషూ శిక్షణ పొందుతున్నారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని ప్రసాద్ అభినందించారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ దువ్వాడ హరీష్ పాల్గొన్నారు.



వూషూ క్రీడాకారులకు బాక్సింగ్ కిట్లు అందిస్తున్న నారపిన్ని ప్రసాద్

వర్షంతో ఉపశమనం



కశింకోటలో వర్షం పడుతున్న దృశ్యం

కశింకోట : కశింకోటలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా పెను గాలులు, ఉరుములతో వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజులుగా ఎండలతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. వర్షంతో పాటు వీచిన గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సుమారు రెండు గంటల అనంతరం విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.

'డైట్'లో ప్రాంగణ నియామకాలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాలలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ప్రాంగణ నియామకాలకు టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ట్రైనింగ్ అధికారి పి.రవికుమార్ మాట్లాడుతూ 88 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. టెక్నికల్ ఇంటర్వ్యూలో 22 మంది ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్ : మండలంలోని వేటజంగాలపాలెంలో సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



వెదుళ్లనరవ సమీపంలో ఒక దాన్ని మరొకటి ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

సబ్బవరం: మండలంలోని వెదుళ్లనరవ సమీపంలో అల్లిమెట్ట మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకున్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన వర్రి గోపాలం(35),చల్లా శ్రీను(35),అల్లు సూరిసత్యం(52),వేమలి కృష్ణమ్మ ఆదివారం ఉదయం దువ్వాడలోని తమ బంధువుల ఇంటికి ఆటోలో శుభకార్యానికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వెదుళ్లనరవ సమీపంలోని అల్లిమెట్ట మలుపు వద్దకు వచ్చే సరికి చోడవరం నుంచి గాజువాక వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక కూర్చున్న నలుగురిలో వర్రి గోపాలం,అల్లు సూరిసత్యం తలలకు తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను స్థానికులు దువ్వాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, బీసీ సంక్షేమ సంఘ చైర్మన్ కృష్ణంనాయుడు

పరవాడ: నాయుడుపాలెం శివారు గొల్లపేటలో శ్రీ కృష్ణాలయ నిర్మాణానికి ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు రూ.10 వేలు, ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ చైర్మన్ కూండ్రపు కృష్ణంనాయుడు రూ.3016 విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, గొర్లివానిపాలెం ఇన్‌చార్జి గొర్లి గోపి, పార్టీ నాయకులు బండారు శ్రావణ్, సారిపల్లి సోమునాయుడు, అశోక్, ఉప్పల నరసింగరావు, జి.నరేష్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలో నారపాడు వైపు వెళ్లే సర్వీసు వద్ద రోడ్డు వద్ద ప్రమాదాల నియంత్రణకు ఆదివారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.ఈ రోడ్డు వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో అమ్ములపాలెం గ్రామస్తుల సహకారంతో ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామని నారపాడు సర్పంచ్ ఎం.శంకరావు తెలిపారు.



సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న అమ్ములపాలెం గ్రామస్తులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన వచ్చింది.అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు గంగుపాం నాగేశ్వరరావు, గొర్ల వెంకటేశ్వరరావు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. కాగా శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

అనకాపల్లిటౌన్ : వివిధ సమస్యల కారణంగా విశాఖ ఉమ్మడి జిల్లాలో గత మూడు మాసాలుగా రావలసిన ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ టీచర్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సన్యాసినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయని, తక్షణమే వాటిపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎంటీఎస్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు.

చురుగ్గా ఓటరు సర్వే



మునగపాకలో ఓటరు సర్వే చేస్తున్న దృశ్యం

మునగపాక : మండల వ్యాప్తంగా ఓటరు సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆగస్టు 22లోగా ఓటరు సర్వే పూర్తి చేయాలన్న ఆదేశాలతో గ్రామాల్లో బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదు అలాగే ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి ఇంటి యజమానులతో మాట్లాడి సవరణలు చేపడుతున్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మునగపాక 170 పోలింగ్ బూత్‌లో పీఏసీ చైర్మన్ ఆడారి సంతోష్ కుమార్ సారథ్యంలో సర్వే చురుగ్గా సాగుతుంది.

సంక్షేమ సారథికి.. సకల జనుల ఆశీస్సులు



బాధితుడు అప్పలనాయుడు కుంటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



మహిళకు సంక్షేమ కార్యక్రమాల బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సంపతిపురం గడప గడపకు కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని సంపతిపురం సచివాలయం పరిధి తమ్మయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన దాకారపు అప్పలనాయుడు కుంటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఇప్పటి వరకూ సుమారు రూ. 18 లక్షలు వైద్యానికి ఖర్చు చేశామని బాధితుని కుటుంబ సభ్యులు మంత్రికి తెలిపారు. ఇక తమకు స్థోమత లేదని, ప్రభుత్వం నుంచి సాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు గ్రామానికొచ్చిన మంత్రికి అధికారులు, డ్వాక్రా మహిళలు పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు గొల్లవిల్లి శ్రీను, పల్లా శ్రీనివాసరావు, నంబారు రమణ, ఒమ్మి రమణ, ఉప్పులూరి నాగేశ్వరరావు, దాకారపు గోవింద్, పి. గోవింద్, ప్రసాద్, డీఆర్‌డీఏ ఏపీఎం కె. నీలాచలం, అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారంతో దృఢమైన ఎముకలు



వైద్యుడు సంపత్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : ఎముకల దృఢత్వానికి పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, ఉదయం రోజూ అరగంట ఎండలో ఉండటం వల్ల ఎముకలపై సూర్యకిరణాలు పడి ఆరోగ్యంగా జీవించవచ్చని కీళ్లు, ఎముకల వైద్యుడు వి.సంపత్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వన్‌వే ట్రాఫిక్ డౌన్ రహదారిలో వాకర్స్ క్లబ్, గీతా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుమటాయిడ్ ఆర్థరైటిస్ (ఆర్ఏ) అనేది దీర్ఘకాలిక వ్యాధి అన్నారు. కీళ్లలో నొప్పి, వాపు, బిగువును కలగచేస్తుందని తెలిపారు. మొదటి దశలో చికిత్స చేస్తే పూర్తిగా నయమవుతుందని అన్నారు. 80 మంది రోగులకు ఉచితంగా ఎముకల పరీక్షలు చేసి, అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ సభ్యులు వైద్యుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యల్లపు శ్రీను, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు కేటీపీ సత్యనారాయణ, బీవీ రమణ, మల్లికార్జునరావు, దాడి సూరిబాబు, శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై రౌండ్ టేబుల్ సమావేశం



భూముల రీ సర్వే అంశంపై సమావేశమైన ప్రజా సంఘాలు, వామపక్షాల నేతలు

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్ రోడ్డు ప్రజా రాజకీయ వేదిక కార్యాలయంలో ఆదివారం ల్యాండ్ రీ సర్వే అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేకు సంబంధించి సరి చేసిన తర్వాతనే రికార్డుల స్వచ్ఛతకు చర్యలు తీసుకోవాలని, సాగులో ఉన్న విస్తీర్ణం కంటే తగ్గించి చెప్పడాన్ని తప్పుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, టీడీపీ నాయకుడు బొలిశెట్టి శ్రీను, సీపీఐ నాయకుడు వై.ఎన్.భద్రం, సీపీఎం నాయకుడు ఎ.బాలకృష్ణ, ఆమ్ ఆద్మీ నేత కొణతాల హరనాథ్‌బాబు, బీజేపీ నేత ఆడారి శరత్, రైతు సంఘాల నాయకుడు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలు ప్రారంభం



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దాడి జయవీర్

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విశాఖ ఉమ్మడి జిల్లాల ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వివేకానంద స్వామి యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ అంతర్ స్కేటింగ్ బాల బాలికల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 450 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో బహుమతులు గెలుపొందాలని ఆయన కోరారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యూనిక్ స్కేటింగ్ అధ్యక్షుడు బి.వి.రామకృష్ణ, కార్యదర్శి కె.రవికుమార్, చీఫ్ కోచ్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక.. అపూర్వ వేడుక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రావలమ్మపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలలో 1994-95లో పదోతరగతికి చదివిన వారు సుమారు 28 ఏళ్ల తర్వాత చోడవరం మండలంలోని అడ్డూరు మజ్జిగైరమ్మ ఆలయ ఆవరణలో కలుసుకున్నారు. వీరంతా ఒకరినొకరు పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గ్రూపు ఫొటోలు తీసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో సబ్బవరం వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు,సబ్బవరపు చిన్నంనాయుడు,జక్కాన నాగేశ్వరరావు,అనకాపల్లి ముత్యాలరావు,బండారు విజయ కుమారి,మంగ, సీహెచ్ లక్ష్మి తదితరులు ఉన్నారు.